# ఇష్టంలేని పెళ్లి

శ్రీ దున్నా కృష్ణారావు

ఆ వేళ ఆదివారం. మావారు వూళ్ళో లేకపోవడంవల్ల పక్కయింటి లక్ష్మీ నేను కూర్చున్నాం. యేవో ఆమాటలూ, యీమాటలూ మాట్లాడుతూ లక్ష్మిఅంది:- "చూశావా? బాపనయ్యగారమ్మాయికి యిష్టంలేకపోయినా కుహూపైన మేనత్తకొడుకిచ్చి వివాహంచేస్తూన్నారు!" ఈ మాటలు వినీవినడంతోనే, నా పూర్వవిషయాలన్నీ స్ఫురణకు రాసాగినాయ్! పరాకుగా ఆలోచించసాగాను. నన్నుచూచి, "ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ ?" అంది. "అబ్బే: యేమీ లేదు: నువ్వు అన్న యీమాటలువినగానే నా పదేళ్ళప్రాయంలో జరిగిన సంగతి ఒకటి జ్ఞాపకంవచ్చింది:" అనగా ఏమిటాసంగతి చెప్పవురాజ్యం అంటూ మొదలెట్టింది.

నేను మొట్టమొదట పెంపకం యివ్వబడ్డాను. నా పెంపకం తల్లిదండ్రులు నన్ను అతి గారాబంగా పెంచుకుంటూండేవారు. నాకు కావలసిన కొత్తరకం పరికిణీలేంటి, గాజులేంటి, ఒకటేంటి సమస్తం కొనిచ్చేవాడు నా పెంపుడుతండ్రి. ఆయన "ప్రెస్" పెట్టడంవల్ల నాక్కు కావలసిన బొమ్మలపుస్తకాలు, కథలపుస్తకాలు తెచ్చిపెడుతూండేవాడు.

నాకు కాస్త జ్ఞానం అనగా పదిపదకొండు సంవత్సరాలు వచ్చింతరువాత నేను పెంపకం యివ్వబడ్డానని తెలుసుకున్నాను. అంతవరకూ వీరే నా స్వంత తలిదండ్రులనుకొనేదాన్ని. మా అసలి తలిదండ్రులకు యింకా యిద్దరు మగవాళ్ళు యిద్దరు ఆడపిల్లలు ఉన్నారని తెలిసికొన్నాను. వాళ్ల యింటికి అప్పుడప్పుడు వెళ్లేదాన్ని.

ఇలావుంటూండగా నాయొక్క దురదృష్టంవల్ల, కర్మవశాత్తు నా పెంపకంతండ్రి పోయేడు. అప్పటినుంచీ నా కేవస్తువులమీదా ఇష్టం వుండేదికాదు. అని చెపుతూండగా లక్ష్మి "అయ్యో! పాపం అంటూ" ఒక దీర్ఘనిట్టూర్పువిడిచింది. "తరువాత చెప్పురాజ్యం" అంటూ అడిగింది. అడగ్గా చెప్పడం మొదలెట్టాను. ఇలావింటూండగా, నా పెంపుడుతల్లి నా వివాహవిషయమై ఆమె తమ్ముడు కొడుకివ్వడానికి నిశ్చయించుకుంది. అతడు చూడ్డానికి అసహ్యంగా వుంటాడు. నాకంటె పొట్టి, చదువులో సున్న! యేమాత్రం నాగరికతమనిషిగాడు! అతనివేషంచూస్తే పీకబిగుసుకుపోయే బొత్తాలమెడచొక్కా, మోకాళ్లవరకు పంచికట్టు వేసుకొని చూస్తూవుంటే ఏమన్యంలోంచో యిప్పుడేవూడిపడ్డట్టు కనబడతాడు. చాల డబ్బుందికాని ఏంలాభం, నాగరికత వొక్కటే తక్కువ.

అలాంటివాణ్ణి చూస్తూచూస్తూ ఎలా వివాహంచేసుకోవడం లక్ష్మీ! దృఢంగా నన్నాతనికిస్తారని ఎప్పుడు తెలిసికొన్నానంటే నేను పుష్పవతినైనతరువాత పంక్తిభోజనాల రోజున మాట్లాడుకున్నపుడు విన్నాను. నాకెంతమాత్రం యిష్టంలేదు. ఆరాత్రంతా నిద్దరపట్టలేదు. సముద్రకెరటాల్లా పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను! కళ్ళు వాచిపోయాయి. ఉదయాన్నేలేచి మా అసలి తలిదండ్రులింటికెళ్ళేను. వారు నా ముఖంవైపుచూచి "ఏంరాజ్యం కళ్లుఅలావాచాయి!"

అని అంటూండగా మా అన్నయ్యలు వచ్చేరు. ఈ సంగతంతా చెప్పేను. వారికి చాలా కోపంవచ్చింది. వెంటనే నన్ను అక్కడనే వుండిపొమ్మన్నారు. మరి నేను వెళ్ళలేదు. నేను మళ్లా యింటికిరాలేదని నా పెంపుడు తల్లి వచ్చింది. ఆమె రాగానే మా నాన్నగారు మా అన్నయ్యలు కోపంతో "ఏం. మా అమ్మాయిని మాకు బరువై మీకిచ్చేం అనుకున్నావా? అటువంటి చదువులేని వెంగళయ్యకు యిచ్చి అనవసరంగా దీని నూరేళ్ల బ్రతుకు దుఃఖసముద్రంలో ముంచేయాలనుకున్నావా? నీ డబ్బు, నీ మేడలూ మా అమ్మాయికి అక్కర్లేదు నీదగ్గరే వుంచుకో! చాలుచాలు, ఇక అది మీయింటి గుమ్మం త్రొక్కనే త్రొక్కదు!'' ఇక దయ చేయ్! "అంటూ సాగనంపారు!''

ఈ మాటలు అవమానంపడి నా పెంపుడుతల్లి లోలోన కుళ్ళి కృశించింది. కన్నప్రేమకంటే పెంచినప్రేమ ఎక్కువగనక నన్ను వదలలేక అనేక కబుర్లుపంపించింది. కాని వెళ్లలేదు. అసలు వెళ్లడానికి నా మనస్సు సుతరామూ యిష్టపడలేదు! ఇదంతావిని "అటువంటి యిష్టంలేని వివేకశూన్యునిచేతులోపడకుండా మీ నాన్నగారు చాలామంచిపనిచేశారు రాజ్యం! ఆతరవాత ఏమయిందీ?" అని ప్రశ్నించింది లక్ష్మి ఇంకా వినాలనే కుతూహలంతో. "తర్వాత యింకేమవుతుందీ? యీ యినస్పెక్టరుగారిచేతుల్లో పడ్డాను!......అంది చిరునవ్వునవ్వుతూ. "కాని, నీకు ధర్మరాజులాంటిభర్త దొరకాడు స్వరాజ్యం'' అంది లక్ష్మి. "నిజమే అదంతా నా అదృష్టమే అనుకుంటున్నా. పెళ్ళికాక ముందు వారిని యెప్పుడుచూచాను అంటే: అలాగ నేను మా అసలి తలిదండ్రులదగ్గిర వుంటూండేటప్పుడే, ఒక రోజున యీ ఆయన గారు మాయింటికి వచ్చారు. మా అన్నయ్యతో యేదో సంభాషిస్తూ కూర్చున్నారు. అప్పుడే పెద్దపులివేషాల బాజాలు వినబడడం చేత చూడ్డానికి గుమ్మం తెరతీసుకొని ఆయన్ని చూడకుండా హాలులోకొచ్చారు. అప్పుడు నన్నాయన చూచారు. నేనూ ఒకసారి ఆయనవైపుచూచి తలవంచుకొని వెళ్ళిపోయాను! ఆలాగే రోజూ ఆయన మా అన్నయ్యలదగ్గిరకు వస్తూండేవారు; నేను యేదో వంకతో ఆయన్ని చూస్తూండేదాన్ని! ఆలాగే కొన్నిరోజులుగడిచాయి. మా అన్నయ్య గారు ఓ రోజున ఆయనగారితో అన్నారట "ఏమండీ మా చెల్లాయికి తొందరగా పెళ్ళి చెయ్యాలి ఎవరైనా మంచి వరుణ్ణి చూచి పెట్టండి!'' అని. ఆయన అన్నారట "ఎవర్నో చూడ్డం ఎందుకండీ? మీకు యిష్టంవుంటే నాకేయివ్వండి!'' అని:—

ఆయన గవర్నమెంటు వుద్యోగస్తులు కావడంచేత, మంచియోగ్యతగలవారవడం వల్లనూ మా నాయనగారు ఆయనకివ్వడానికిష్టపడ్డారు. తరువాత నాలుగుమాసాలకు మా వివాహం అయింది!" ఇదీ నా కథ! ఇదంతా నా స్మృతిపటంమీదికి స్ఫురించడం చేత దీర్ఘంగా ఆలోచిస్తూవున్నాను. అందుచేతనే అటువంటి వివాహాలు కూడదని నా అభిప్రాయము.

నిజమే! అలా మనస్సుకు నచ్చని పెళ్ళిళ్ళు చేసుకుంటేమేం, లేకపోతేమేం అంది లక్ష్మి!''

Printed by B. Nagi Reddy at the B. N. K. Press, 43, Acharappan Street, G. T. Madras, and Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St., G.T., Madras.